సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

మంగళవారం । 24 । జనవరి । 2023



అవినీతిపై విచారణ చేయండి
ఆంధ్రప్రదేశ్ హాకీ అసోసియేషన్‌లో అవినీతిపై విచారణ చేపట్టి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని హాకీ క్రీడాకారులు శాప్ ఎండీ ప్రభాకరరెడ్డికి వినతిపత్రం అందజేశారు. -IIలో▸



మళ్లీ మళ్లీ ఇది రానిరోజు
నోరి రామశాస్త్రి ప్రభుత్వ ఆయుర్వేద కళాశాలలో డిగ్రీ ఆయుర్వేద వైద్యం కోర్సు మొదటి బ్యాచ్ విద్యార్థులు సత్యనారాయణపురంలోని గాయత్రి ఫంక్షన్ హాల్లో సమావేశమయ్యారు. -IIలో▸




పులిచింతల నీటి నిల్వ
అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 42.9635 టీఎంసీలు. ఎగువ నుంచి 2000 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 2200 క్యూసెక్కులు వదులుతున్నారు.



విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జాతీయ జెండాను ఏర్పాటు చేస్తున్న దృశ్యం



ప్రదర్శనకు సిద్ధమవుతున్న శకటాలు



విద్యుత్ దీపాల వెలుగులో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం

చురుగ్గా గణతంత్ర ఏర్పాట్లు

విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈ నెల 26వ తేదీన నిర్వహించనున్న గణతంత్ర దినోత్సవానికి చురుగ్గా ఏర్పాట్లు సాగుతున్నాయి. పరేడ్‌లో ప్రదర్శించనున్న శకటాలకు సోమవారం తుది మెరుగులు దిద్దుతున్నారు. స్టేడియంలో గ్యాలరీ చుట్టూ జాతీయ జెండాను అందంగా అలంకరిస్తున్నారు. పోలీస్, ఇతర శాఖల అధికారులు రిహార్సల్స్‌తో బిజీగా ఉన్నారు. అదేవిధంగా పలు ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. - విశాల్, పవన్, విజయ్‌కృష్ణ, సాక్షి ఫొటోగ్రాఫర్లు, విజయవాడ

న్యూస్‌రీల్

టెలీ కన్సల్టెన్సీ విధానం అద్భుతం
కేంద్ర మంత్రి భారతీ ప్రవీణ్ పవార్



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): టెలీ కన్సల్టెన్సీ ద్వారా యూపీహెచ్‌సీల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి భారతీ ప్రవీణ్ పవార్ అన్నారు. విజయవాడ భవానీపురంలోని యూపీహెచ్‌సీని కేంద్ర సహాయ మంత్రి సోమవారం సందర్శించారు. ఆమెకు నోడల్ ఆఫీసర్ విజయలక్ష్మి స్వాగతం పలికారు. కేంద్ర సహాయ మంత్రి భారతి ప్రవీణ్ పవార్ ఆస్పత్రిలో అన్ని గదులు కలియతిరిగారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా పేదలకు మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు. టెలీ కన్సల్టెన్సీ విధానం ద్వారా యూపీహెచ్‌సీకి వచ్చిన రోగులను అనుభవజ్ఞులైన వైద్యులు పరీక్షిస్తున్నారన్నారు. ఈ విధానంలో రోగి దూర ప్రాంతాలకు వెళ్లే పని లేదని, అత్యవసర పరిస్థితి ఉంటే రోగికి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తరలిస్తారని, సాధారణంగా అన్ని వ్యాధులకు ఈ సెంటర్లలోనే వైద్యం లభిస్తుందన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, డీఎంహెచ్‌ఓ సుహాసిని పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ



గన్నవరం: మండలంలోని కేసరపల్లి గ్రామ సచివాలయం-1ను రాష్ట్ర ప్రభుత్వ చేనేత, జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కె.సునీత సోమవారం తనిఖీ చేశారు. సచివాలయంలో సదుపాయలను పరిశీలించడంతో పాటు సిబ్బంది పనితీరును పర్యవేక్షించారు. అనంతరం సచివాలయ సిబ్బంది హాజరు, రికార్డులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా సచివాలయం ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరుపై సిబ్బందితో ఆమె సమీక్షించారు. అర్హులైన ప్రతిఒక్కరూ సంక్షేమ పథకాలు ద్వారా లబ్ధి పొందే విధంగా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. గ్రామ శివారులోని ఏలూరు కాలువ పక్కన ఉన్న వైఎస్సార్ జగనన్న కాలనీలోని లేఅవుట్‌ను సందర్శించారు. రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించారు. గుడివాడ డీఎల్‌పీఓ సంపతికుమారి, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, సర్పంచ్ లక్ష్మీమౌనిక పాల్గొన్నారు.

బాలికతో అసభ్య ప్రవర్తన.. వ్యక్తికి ఐదేళ్ల జైలు

విజయవాడ స్పోర్ట్స్: బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఆమె మారు తండ్రికి ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ విజయవాడ పోక్సో కోర్టు న్యాయమూర్తి డాక్టర్ ఎస్.రజిని సోమవారం తీర్పు చెప్పారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ కొత్తపేట వైఎస్సార్ కాలనీకి చెందిన మహిళ తన భర్త అనారోగ్యంతో చనిపోవడంతో లారీ డ్రైవర్ బత్తుల నాగరాజును రెండో పెళ్లి చేసుకుంది. అప్పటికే ఆమెకు ఒక కుమార్తె ఉంది. సదరు మహిళ ఇంట్లో లేని సమయంలో ఆమె కుమార్తె పట్ల నాగరాజు వావివరసలు మర్చిపోయి అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాలిక కేకలు వేయడంతో అక్కడ నుంచి పరారయ్యాడు. 2022 సెప్టెంబర్ పదో తేదీన జరిగిన ఘటనపై సంబంధిత కొత్తపేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. అదే రోజు కేసు నమోదు చేసిన పోలీసులు అదే నెల 12వ తేదీన నిందితుడు నాగరాజును అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరు పర్చారు. తొమ్మిది మంది సాక్షులను విచారించిన అనంతరం నేరం రుజువు కావడంతో నిందితుడు నాగరాజుకు కఠిన కారాగార శిక్షతో పాటు రూ.15 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. నిందితుడు చెల్లించిన జరిమానాలో రూ. 12 వేలను బాధితురాలికి అందజేయడంతో పాటు మరో రూ. 50 వేలు నష్టపరిహారం అందించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు న్యాయమూర్తి ఆదేశాలిచ్చారు. కేవలం నాలుగు నెలల్లోనే విచారణ పూర్తి చేసి, నిందితుడికి జైలు శిక్ష విధించడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

అమ్మకు అండగా..



- జీజీహెచ్‌లో సుఖ ప్రసవాలే లక్ష్యం
- ప్రసూతి విభాగంలో అత్యుత్తమ సేవలు
- రోజూ 30 నుంచి 40 మందికి ప్రసవాలు
- వాటిలో 20 నుంచి 25 వరకూ సిజేరియన్ కేసులు
- ఐదు జిల్లాల ప్రజలకు పెద్దదిక్కులా మారిన వైనం
- ఇక్కడకు వచ్చే వారిలో క్రిటికల్ కేసులే ఎక్కువ
- అధునాతన సౌకర్యాలతో ఐసీయూ
- 24 గంటలు అందుబాటులో రక్తపరీక్షలు



ప్రసూతి విభాగంలో బాలింతలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో కార్పొరేట్‌కు మించిన రీతిలో ప్రసూతి విభాగం వైద్యులు సేవలు అందిస్తూ అమ్మకు అండగా నిలుస్తున్నారు. ఇక్కడకు వచ్చిన ప్రతి గర్భిణీకి సుఖ ప్రసవం చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నారు. అందుకోసం వైద్యులు, సిబ్బంది నిరంతరం కృషి చేస్తుంటారు. ప్రభుత్వం అత్యాధునిక సౌకర్యాలు సమకూర్చడంతో పాటు, వైద్యుల కృషి ఫలితంగా వేలాది మందికి మాతృత్వపు మధురిమలు అందిస్తున్నారు. సాధ్యమైనంత వరకూ నార్మల్ డెలివరీలు చేస్తారు. తప్పని పరిస్థితుల్లో సిజేరియన్లు చేస్తున్నారు.

ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా సేవలు

నిత్యం 30 నుంచి 40 డెలివరీలు చేస్తుండగా, వాటిలో 20 నుంచి 25 సిజేరియన్ కేసులు ఉంటున్నాయి. రోజూ 250 నుంచి 300ల మంది గర్భిణులు, బాలింతలు, పలు సమస్యలతో మహిళలు పరీక్షల నిమిత్తం వస్తుంటారు. వీరందరికీ మెరుగైన సేవలు అందించేందుకు వైద్యులు, సిబ్బంది శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారు. ఎవరికీ ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా సేవలు అందిస్తున్నారు.

అత్యాధునిక సౌకర్యాలు

నగరంలోని ఏ కార్పొరేట్ ఆస్పత్రిలో లేని సౌకర్యాలు ప్రభుత్వాస్పత్రిలోని ప్రసూతి విభాగంలో ఉన్నాయి. ఐదు ఆపరేషన్ థియేటర్లు(ప్లానింగ్ సర్జరీలకు 2, ఎమర్జెన్సీ సర్జరీలకు 2, సెప్టిక్ సర్జరీలకు 1), వెంటిలేటర్స్‌తో కూడిన 15 పడకలతో ఐసీయూ, 20 పడకలతో ఆధునిక లేబర్ వార్డు అందుబాటులో ఉన్నాయి. గర్భిణులకు స్కానింగ్ చేసేందుకు రెండు అల్ట్రాసౌండ్ స్కానింగ్ యూనిట్లు, ఒక మొబైల్ అల్ట్రాసౌండ్ స్కానింగ్ మెషిన్ అందుబాటులో ఉంది. 24 గంటల లేబొరేటరీ ఏర్పాటు చేశారు.

క్లిష్టమైన కేసులే అధికం

ప్రభుత్వాస్పత్రికి వచ్చే వారిలో క్లిష్టతరమైన కేసులే అధికంగా ఉంటున్నాయి. తీవ్రమైన రక్తహీనతతో వచ్చే వారు ఎక్కువగా ఉంటున్నారు. ప్రసవ సమయంలో వచ్చిన వారికి పరీక్ష చేస్తే హిమోగ్లోబిన్ శాతం 6 లేదా 7 గ్రాములు ఉంటోంది. అలాంటి వారికి రెండు, మూడు బ్లడ్ యూనిట్‌లు కూడా ఎక్కిస్తున్నారు. మధుమేహం, అధిక రక్తపోటు ఉన్న వారు వస్తుంటారు. అధిక రక్తపోటుతో వచ్చిన వారికి సేవలు అందించేందుకు జనరల్ మెడిసిన్ నిపుణులు అందుబాటులో ఉన్నారు. అంతేకాదు అవసరమైతే కార్డియాలజిస్టులు, న్యూరాలజిస్టులను సైతం పిలిపించి పరీక్ష చేయిస్తున్నారు.

డెలివరీలు ఇలా..

సంవత్సరం	కేసుల సంఖ్య
2018	7,962
2019	8,461
2020	9,313
2021	9,723
2022	9,865

ఐదు జిల్లాల ప్రజలకు పెద్దదిక్కుగా..

ఈ ఆస్పత్రికి ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల నుంచే కాకుండా, ఏలూరు, పశ్చిమగోదావరి, గుంటూరు జిల్లాలకు చెందిన వారు నిత్యం ప్రసవం కోసం వస్తుంటారు. ఏలూరు ప్రభుత్వాస్పత్రి, భీమవరం, నూజివీడు, కైకలూరు, మచిలీపట్నం, గుడివాడ, జగ్గయ్యపేట, మంగళగిరి ప్రాంతాల ఆస్పత్రుల నుంచి క్రిటికల్ స్టేజ్‌లో ఇక్కడకు పంపుతుంటారు. తెనాలి నుంచి సైతం కొందరు విజయవాడ వస్తుంటారు. గర్భిణి ఎలాంటి పరిస్థితిలో వచ్చినా సుఖ ప్రసవం చేసేందుకు వైద్యులు కృషి చేస్తుంటారు.

పూర్తిస్థాయి సిబ్బంది

ప్రసూతి విభాగంలో ప్రస్తుతం నలుగురు ప్రొఫెసర్లు, ఏడుగురు అసోసియేట్ ప్రొఫెసర్లు, 12 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు పనిచేస్తున్నారు. వీరితో పాటు, మరో నలుగురు ఎస్ఆర్‌లు, 21 మంది పోస్టు గ్రాడ్యుయేషన్ విద్యార్థులు ఉన్నారు. ఆయుర్వేదంలో పీజీ చేస్తున్న వారు ఆరుగురు ఇక్కడ శిక్షణ కోసం వచ్చి సేవలు అందిస్తున్నారు. ఇలా మొత్తం 55 మంది వరకూ సేవలు అందిస్తున్నారు. వీరితో పాటు, మరో ఆరుగురు అనస్తీషియన్లు, ముగ్గురు రేడియాలజిస్టులు ఈ విభాగంలో విధులు నిర్వహిస్తున్నారు.

అర్ధరాత్రివేళ వచ్చినా..

నగరంలోని ఏ కార్పొరేట్, ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లినా, అర్ధరాత్రి వేళ ఎమర్జెన్సీ సర్జరీలు చేయడం చాలా అరుదు. అయితే విజయవాడ జీజీహెచ్ ప్రసూతి విభాగంలో అత్యవసరంగా సిజేరియన్ చేయాల్సి వస్తే, ఆస్పత్రిలో చేరిన గంటలోపే సిజేరియన్ చేసిన ఘటనలు అనేకం ఉన్నాయి. ఇక్కడ 24 గంటలు క్వాలిఫైడ్ వైద్యులు, వైద్య సిబ్బంది, పోస్టుగ్రాడ్యుయేషన్ విద్యార్థులు అందుబాటులో ఉండడంతో అత్యవసర వైద్యం అవసరమైన వారికి సకాలంలో అందించగలుగుతున్నారు. అర్ధరాత్రి రక్తం అవసరమైనా, బయటకు పరుగులు తీయకుండా, ఆస్పత్రిలోనే బ్లడ్ స్టోరేజ్ యూనిట్ ఉండడంతో అక్కడే ఉచితంగా అందిస్తున్నారు.

అత్యుత్తమ సేవలు



ప్రసూతి విభాగానికి వచ్చిన ప్రతి ఒక్కరికీ అత్యుత్తమ సేవలు అందిస్తున్నాం. ఎవరికీ ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తున్నాం. ప్రతి నెలా వెయ్యి వరకూ డెలివరీలు చేస్తుండగా, వాటిలో 550 నుంచి 600 సిజేరియన్ కేసులు ఉంటున్నాయి. వేర్వేరు ప్రాంతాల నుంచి క్రిటికల్ పరిస్థితుల్లో ఉన్న వారిని ఇక్కడకు రిఫర్ చేస్తుంటారు. వారికి సుఖ ప్రసవం చేసేందుకు ఇక్కడి వైద్యులు నిరంతరం కృషి చేస్తున్నారు. నిపుణులైన వైద్యులు, ఆధునిక సౌకర్యాలు ఉండడంతోనే మెరుగైన సేవలు అందించగలుగుతున్నాం.

– డాక్టర్ బి.సౌభాగ్యలక్ష్మి, సూపరింటెండెంట్, ప్రభుత్వాస్పత్రి

ఓటు హక్కు వినియోగంతో ప్రజాస్వామ్య పరిరక్షణ
ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): 18 సంవత్సరాలపైబడిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదై ఓటును వినియోగించుకోవడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడంలో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు పేర్కొన్నారు. ఈ నెల 25వ తేదీన జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఓటరుగా నమోదు, ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించేందుకు రూపొందించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరుగా నమోదు కావడం ప్రతి ఒక్క భారతీయుడు గర్వంగా భావించాలన్నారు. ఓటు హక్కును వినియోగించుకోవడం పౌరుడి ప్రాథమిక బాధ్యతను, దానిని నిర్వర్తించడం కర్తవ్యంగా గుర్తెరగాలన్నారు. ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని కాపాడటంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందన్నారు. 2023 జనవరి ఒకటో తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటర్‌గా నమోదు చేయాల్సిన బాధ్యత బూత్ స్థాయి అధికారులపై ఉందన్నారు. ఎన్నికల అధికారులు, సిబ్బంది వారి పరిధిలోని ఇంటింటినీ సందర్శించి, ఓటరుగా నమోదు కాని వారిని గుర్తించి ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ డేటాకు ఆధార్ అనుసంధానం ప్రక్రియ జరుగుతోందన్నారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈ ప్రక్రియ వేగవంతంగా జరుగుతుందన్నారు. ఓటర్ డేటాకు ఆధార్ అనుసంధానంతో నాణ్యమైన, కచ్చితమైన ఓటర్ జాబితా సాధ్యపడుతుందన్నారు. ఓటు ప్రతి పౌరుని హక్కు అని, ఓటు హక్కు వినియోగించుకోవడం ప్రతి పౌరుని బాధ్యతగా గుర్తించుకోవాలని కోరారు. జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్, డీఆర్వో మోహన్‌కుమార్, కలెక్టరేట్ పరిపాలన అధికారి ఇంతియాజ్ బాషా, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ వెలగా జోషి పాల్గొన్నారు.



ఘన సత్కారం
విజయవాడ ఎంబీ భవన్‌లో జరిగిన క్యూబా సంఘీభావ సభలో సోమవారం పాల్గొన్న లాటిన్ అమెరికా విప్లవ యోధుడు చేగువేరా కుమార్తె డాక్టర్ అలైదా గువేరా, మనవరాలు ప్రొఫెసర్ ఎస్తోఫానియాను ఘనంగా సత్కరిస్తున్న ఏపీ ఫైబర్‌నెట్ చైర్మన్ పూనూరు గౌతంరెడ్డి.
-సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

స్పందన సమస్యలకు తక్షణ పరిష్కారం
జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అర్జీదారుడు సంతృప్తి చెందేలా 'స్పందన'లో సమస్యలను పరిష్కరిస్తున్నామని జిల్లా కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు పేర్కొన్నారు. ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలపై ఆయా శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందించడంతో సమస్యలు త్వరితగతిన పరిష్కారం అవుతున్నాయని తెలిపారు. కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కారవేదిక స్పందన కార్యక్రమం జరిగింది. జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన అర్జీలకు తక్షణమే పరిష్కారం చూపాలని జిల్లా అధికారులను ఆదేశించారు.

నూతన వరవడికి శ్రీకారం

ప్రజల నుంచి అర్జీలను స్వీకరించడంల్లో కలెక్టర్ ఢిల్లీరావు నూతన వరవడికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా శాఖల వారిగా ప్రత్యేక టేబుల్స్ ఏర్పాటు చేశారు. అర్జీదారుడు నేరుగా సంబంధిత శాఖ అధికారులను కలుసుకునే వీలుగా ఏర్పాటు చేశారు. దీంతో అర్జీదారుడు తన సమస్యపై వినతిపత్రాన్ని సంబంధిత జిల్లా అధికారికి అందజేసి, అక్కడికక్కడే పరిష్కరించుకునేందుకు మార్గం సుగమం చేశారు. జిల్లా అధికారి స్థాయిలో పరిష్కారం కాని అర్జీలను కలెక్టర్, జాయింట్ కలెక్టర్లు పరిష్కరించారు.



'స్పందన'లో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

'స్పందన'లో 99 వినతులు

సోమవారం నిర్వహించిన 'స్పందన'లో ప్రజల నుంచి 99 అర్జీలు అందాయి. వీటిలో అత్యధికంగా రెవెన్యూ శాఖలో 48 అర్జీలు నమోదయ్యాయి. పోలీస్ శాఖ-20, మున్సిపల్-10, పంచాయతీరాజ్ శాఖ-6, విద్య-2, దేవదాయ శాఖ-2, రిజిస్ట్రేషన్ శాఖ-1, వైద్య శాఖ-1, ఇతర శాఖలకు సంబంధించి మరో 9 అర్జీలు అందాయి. జిల్లాలోని డివిజనల్ అధికారులు, ఆయా మండలాల ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో పరిష్కారమయ్యే వినతులను కలెక్టర్ అక్కడికక్కడే పరిష్కరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్, డీఆర్వో కె.మోహన్‌కుమార్, డ్వామా పీడీ జె.సునీత, ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి, డీసీఓ సీహెచ్ శైలజ, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, హౌసింగ్ పీడీ శ్రీదేవి, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి ఎం. విజయభారతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కరకట్ట వాసుల రక్షణలో మరో అడుగు ముందుకు

- రిటైనింగ్ వాల్ మూడో దశ పనులు ప్రారంభం
- వారధి నుంచి పద్మావతి ఘాట్ వరకు రిటైనింగ్ వాల్
- రూ.137 కోట్లతో 1.05 కి.మీ పొడవున నిర్మాణం
- వరద ముంపు నుంచి శాశ్వత పరిష్కారం దిశగా...
- తీరనున్న రణదీవె నగర్ ప్రాంతవాసుల కష్టాలు



రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు జరుగుతున్న దృశ్యం

కృష్ణలంక(విజయవాడ తూర్పు): కృష్ణానది వెంబడి కరకట్టవాసులకు రక్షణగా మూడో దశ రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. కనకదుర్గ వారధి నుంచి పద్మావతి ఘాట్ వరకు 1.05 కిలోమీటర్ల పొడవున సుమారు రూ.137 కోట్ల నిధులతో రిటైనింగ్ వాల్ మూడో దశ నిర్మాణ పనులు ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులు లభించడంతో పాటు టెండర్లు కూడా ఖరారవడంతో వాల్ నిర్మించే ప్రాంతంలో పొక్లెయిన్లతో చెట్ల పొదలను, చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రం చేసే పనులు చేపట్టారు. కృష్ణానదికి వరదలు వచ్చినప్పుడల్లా కృష్ణలంక కరకట్ట ప్రాంతాలైన భూపేష్‌గుప్తా నగర్, తారకరామ నగర్, రణదీవె నగర్ ప్రాంతాలు వరద ముంపునకు గురవుతుండడంతో ప్రజలు తరచూ తట్టాబుట్ట సర్దుకుని పునరావాస కేంద్రాలకు తరలి వెళ్తుండేవారు. విలువైన సామానులు వరద నీటిలో తడిసి ఆర్థికంగా నష్టపోతుండేవారు. వరద ముంపు నుంచి వీరికి రక్షణ కల్పించేందుకు గత టీడీపీ ప్రభుత్వం యనమలకుదురు నుంచి కోటినగర్ వరకు 2.2 కి.మీ. పొడవున మొదటి దశ రిటైనింగ్ వాల్ నిర్మాణం పూర్తి చేసి ఆ తర్వాత విస్మరించింది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 2019లో సంభవించిన వరదలతో ముంపునకు గురైన ప్రాంతాల్లో పర్యటించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కరకట్ట ప్రాంత వాసుల కష్టాలను కళ్లారా చూసి ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారంగా రిటైనింగ్ వాల్ నిర్మించాలని అధికారులను ఆదేశించారు. వెంటనే రిటైనింగ్ వాల్ నిర్మాణానికి రూ.123 కోట్ల నిధులు మంజూరు చేయడంతో కోటినగర్ నుంచి కనకదుర్గ వారధి వరకు 1.5 కిలోమీటర్ల పొడవున రెండో దశ రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు ప్రారంభించి పూర్తి చేశారు. ఇప్పుడు కనకదుర్గ వారధి నుంచి పద్మావతి ఘాట్ వరకు 1.05 కి.మీ. పొడవున మూడో దశ రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులకు రూ.137 కోట్ల నిధులు మంజూరవడంతో నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ నిర్మాణం పూర్తయితే కృష్ణలంకలోని రణదీవెనగర్, గౌతమీనగర్, నెహ్రూ నగర్, ద్వారకా నగర్‌లో నివసిస్తున్న సుమారు 30 వేల మంది జనాభాకు వరద ముంపు నుంచి రక్షణ కలుగనుంది. 12లక్షల క్యూసెక్కుల వరద ముంపు నుంచి తట్టుకునేలా నదీ తీర ప్రాంత ప్రజలకు రక్షణ కలుగుతుంది. నిర్మాణ పనులు ప్రారంభమవడంతో వరద ముంపు కష్టాలు తీరనున్నాయని కరకట్ట ప్రాంత ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అర్చకులకు ఆరోగ్యశ్రీ కార్డులు

మచిలీపట్నంటౌన్: దేవాలయాల్లో పనిచేసే రూ. 5 లక్షల్లోపు ఆదాయం ఉన్న అర్చకులకు, ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కార్డులు మంజూరు చేస్తున్నందున అర్హత ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని కృష్ణా జిల్లా దేవదాయశాఖ అధికారి బి.సాయిబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులు వారి దరఖాస్తులతో పాటు ఆదాయ ధ్రువీకరణ పత్రాన్ని జత చేసి, వారి పరిధిలోని సచివాలయాల్లో అందజేయాలని పేర్కొన్నారు. అలాగే ప్రతి సోమవారం మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మచిలీపట్నంలోని ఆంధ్ర జాతీయ కళాశాల ఆవరణలో ఉన్న తమ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవదాయశాఖలో పనిచేసే అర్చకులు, ఉద్యోగులు వారి సమస్యలపై వినతులు అందజేయవచ్చని ఆయన పేర్కొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన మరో లారీ

కృత్తివెన్ను(పెడన): జాతీయ రహదారి 216పై రెండు లారీలు ఢీ కొన్న సంఘటన సోమవారం తెల్లవారుజామున కృత్తివెన్ను సమీపంలోని అడ్డపర్ర వద్ద చోటు చేసుకుంది. రహదారిపై ఆగి ఉన్న లారీని బెంగళూరు నుంచి మండపేట పేపర్ లోడుతో వెళ్తున్న మరో లారీ ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఢీ కొట్టిన లారీ ముందుభాగం పూర్తిగా ధ్వంసం అయ్యింది. కాగా ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

విజయవాడ స్పోర్ట్స్: ఆర్టీసీ బస్సు ఢీ కొనడంతో గుణదలకు చెందిన దంగేటి కరుణ కుమార్(27) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందారు. ఏలూరు రోడ్డులోని చుట్టగుంట సమీపంలో సోమవారం ఈ ఘటన చోటు చేసుకుంది. మృతుడు గుణదలలోని తన ఇంటి నుంచి పండిట్ నెహ్రూ బస్టాండ్‌కు వెళ్తుండగా ఆర్టీసీ సిటీ బస్సు వెనుక నుంచి వేగంగా ఢీ కొట్టింది. బస్సు చక్రాలు అతనిపై నుంచి వెళ్లడంతో కరుణకుమార్ ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లు మృతుడి కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. మృతుడు తండ్రి త్రిమూర్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సూర్యారావుపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీసీల చూపు సీఎం వైఎస్ జగన్ వైపే

బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మారేష్



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఎస్.మారేష్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న బీసీలు పార్టీలకు అతీతంగా తమ ఆత్మ గౌరవాన్ని పెంచుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైపే చూస్తున్నారని ఏపీ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎస్.మారేష్ పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ గురునానక్‌నగర్‌లోని ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్రంలో ఉన్న బీసీల జీవన స్థితిగతులపై సోమవారం చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు దాటుతున్నా ఇంతవరకు ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సామాజిక న్యాయాన్ని గీటురాయిగా చేసుకుని బీసీలకు రాజ్యాధికారం కల్పిస్తున్న ఏకైక వ్యక్తి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అన్నారు. ముఖ్యమంత్రిగా జగన్ పదవీ బాధ్యతలను చేపట్టిన దగ్గర నుంచి నేటి వరకు బీసీల పక్షపాతిగా అనేక కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. స్థానిక సంస్థలు, మండల అధ్యక్షులు, జిల్లా పరిషత్ ఛైర్మన్లు, మేయర్లు, మార్కెట్ యార్డ్ ఛైర్మన్లు ఇలా ఏ విభాగంలో చూసినా బీసీలకు సముచిత స్థానం కల్పించిన మానవతావాది సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు.

చంద్రబాబు చేసింది శూన్యం..

ముఖ్యమంత్రిగా 14 ఏళ్ల అనుభవం ఉందని చెప్పుకుంటున్న చంద్రబాబు బీసీలకు చేసింది శూన్యమని మారేష్ పేర్కొన్నారు. ఆయన పాలనలో 25 శాతం దాటి ఏనాడూ బీసీలకు పదవులు ఇచ్చిన చరిత్ర లేదన్నారు. అటువంటి వ్యక్తి తమది బీసీల పార్టీ అని చెప్పుకుంటుంటే 65 శాతానికిపైగా బీసీలకు పదవులు ఇచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఏమనాలని ప్రశ్నించారు. పార్లమెంట్‌లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ల కోసం ప్రైవేట్ బిల్లు తీసుకువచ్చిన చరిత్ర సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వేముల బేబీరాణి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మోర్ల మహిధర్, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అర్షద్, విజయవాడ యూత్ అధ్యక్షుడు సాయి, అర్బన్ అధ్యక్షుడు మహమ్మద్ ఖలీమ్, తూర్పు అధ్యక్షుడు శివ నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ విధానాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్దాం

కేంద్ర మంత్రి ప్రవీణ్ భారతి పవార్



మాట్లాడుతున్న కేంద్రమంత్రి ప్రవీణ్ భారతిపవార్

గుడివాడటౌన్: సమాజసేవ, సేవాతత్వం భారతదేశ సంస్కృతి అని ఆ అంశాలను అమలు చేస్తున్న ఏకైక పార్టీ భారతీయ జనతాపార్టీ అని కేంద్ర గ్రామీణ వైద్యశాఖ సహాయమంత్రి ప్రవీణ్ భారతిపవార్ అన్నారు. స్థానిక వీకేఆర్, వీఎన్‌బీ, అండ్ ఏజీకే ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో కృష్ణాజిల్లా బీజేపీ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. బీజేపీ సేవాభావం కరోనా సమయంలో కార్యకర్తలు చేసిన సేవలకు నిదర్శనం అన్నారు. కేంద్ర ప్రభుత్వం విద్య, వైద్యం, రవాణా, నీటిపారుదల, ఆహారం పంపిణీ, గ్రామీణ ఉపాధి వంటి అనేక కార్యక్రమాల్లో రాష్ట్రానికి పెద్ద ఎత్తున నిధులు సమకూరుస్తోందని ఆ విషయాన్ని కార్యకర్తలు క్షేత్రస్థాయికి తీసుకువెళ్లాలన్నారు. అప్పుడే 2024 సాధారణ ఎన్నికల్లో రాష్ట్రంలో భారతీయ జనతాపార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ఆమె అన్నారు. అనంతరం వివిధ పార్టీల నుంచి భారతీయ జనతాపార్టీలో చేరిన కార్యకర్తలకు ఆహ్వానం పలికారు. రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిట్ర శివన్నారాయణ, కిసాన్ మోర్చ ప్రధాన కార్యదర్శి తిరువూరి బుచ్చిరాజు, మీడియా సెల్ కన్వీనర్ లక్ష్మీపతిరాజు, జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ శ్రీరాజబాబు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ జిల్లా పరిధిలో..

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరంలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో శక్తి కేంద్ర ప్రముఖ్‌ల సమావేశం భవానీపురంలోని బీజేపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు బబ్బూరి శ్రీరామ్ నివాసంలో సోమవారం జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ భారతి ప్రవీణ్ పవార్ పాల్గొన్నారు. తొలుత స్వాతంత్ర్య సమర యోధుడు సుభాస్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని ఆమె నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ బూత్ కమిటీ సభ్యులుగా నియమించిన ప్రముఖ్‌లతో మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, ప్రధాన కార్యదర్శి సూర్యనారాయణరాజు, కార్యదర్శులు సుధాకర్ యాదవ్, పాతూరి నాగభూషణం, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి, మరొకరికి తీవ్రగాయాలు

పామర్రు(పమిడిముక్కల): విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారిలో పమిడిముక్కల మండలం గురజాడ గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా, మరొక వ్యక్తికి తీవ్ర గాయాలపాలైన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమంతపురానికి చెందిన పోరంకి పెద అప్పల రాజు(75), ఆయన సోదరుడు పోరంకి వెంకటరాజులు తమ టీవీఎస్ ద్విచక్ర వాహనంపై విజయవాడ వైపు నుంచి వస్తున్నారు. ఈ క్రమంలో గురుజాడ వద్దకు రాగానే వెనుక నుంచి వచ్చిన కారు వీరిని బలంగా ఢీ కొట్టింది. దీంతో అప్పల రాజు, వెంకటరాజులకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గ మధ్యలో పెద అప్పలరాజు మృతి చెందారు. ప్రస్తుతం వెంకటరాజు పరిస్థితి కూడా విషమంగానే ఉందని పమిడిముక్కల మండలం ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

ప్రమాదానికి కారణమైన వ్యక్తికి ఏడాది జైలు

విజయవాడ స్పోర్ట్స్: నిర్లక్ష్యంగా బస్సు నడిపి ఆ బస్సు క్లీనర్ గాయాల పాలవడానికి కారణమైన వ్యక్తికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ విజయవాడ మూడో మెట్రోపాలిటన్ కోర్టు న్యాయమూర్తి యు.రామ్మోహన్ సోమవారం తీర్పు చెప్పారు. తూర్పుగోదావరి జిల్లాకు వ్యక్తి ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో క్లీనర్‌గా పని చేసేవాడు. 2021 ఫిబ్రవరి మూడో తేదీ అర్ధరాత్రి విజయవాడ హనుమాన్‌పేటలో ప్రయాణికులను ఎక్కించాడు. అనంతరం అదే ప్రాంతం నుంచి బస్సు రివర్స్ చేయాల్సి వచ్చింది. డ్రైవర్ కట్టమూర్తి లక్ష్మీనారాయణ ఆదేశాల మేరకు బస్సు రివర్స్ చేసేందుకు క్లీనర్ కిందకు దిగి సిగ్నల్స్ ఇస్తుండగా.. వేగంగా వెనక్కు వచ్చిన బస్సు క్లీనర్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో క్లీనర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే తనకు గాయాలయ్యాయని క్లీనర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంబంధిత గవర్నర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో అదే రోజు కేసు నమోదయింది. బాధితుడు తరపున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సిద్ధిక్‌అహ్మద్ న్యాయస్థానంలో వాదనలు వినిపించారు. ఏడుగురు సాక్షులను విచారించిన అనంతరం నేరం రుజువు కావడంతో నిందితుడు లక్ష్మీనారాయణకు జైలు శిక్షతో పాటు రూ. వెయ్యి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

నవోదయ అడ్మిషన్లలో నిబంధనలతో నష్టం

కృష్ణా కలెక్టర్‌కు విన్నవించిన తల్లిదండ్రులు



కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

చిలకలపూడి(మచిలీపట్నం): గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ కలిగిన విద్యార్థుల కోసం కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జవహర్ నవోదయ విద్యాలయాల్లో ప్రవేశం కోసం పెట్టిన వయసు నిబంధన, స్థానికత విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో విద్యార్థులు కృష్ణా కలెక్టర్ పి. రంజిత్‌బాషాకు వినతిపత్రం సమర్పించారు. నవోదయ విద్యాలయ సమితి ఇచ్చిన నోటిఫికేషన్‌లో 2009 మే 1వ తేదీ నుంచి 2013 ఏప్రిల్ 30వ తేదీ వరకు వయసు నిబంధనను ఇచ్చారన్నారు. 2023లో ఇచ్చిన నోటిఫికేషన్‌లో 2011 మే 1 నుంచి 2013 ఏప్రిల్ 30వ తేదీ వరకు వయసు పరిమితి ఇచ్చారని దీని కారణంగా నవోదయ విద్యాలయంలో ప్రవేశ పరీక్షలు రాసేందుకు వందల సంఖ్యలో విద్యార్థులు అర్హత కోల్పోతున్నారన్నారు. సమితి నిబంధనల ప్రకారం పిల్లలు ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్నారని, కానీ వయసు నిబంధన తక్కువగా ఇవ్వటం వల్ల ప్రవేశ పరీక్ష రాయలేకపోతున్నారన్నారు. దీనిపై కలెక్టర్ రంజిత్‌బాషా స్పందిస్తూ నవోదయ విద్యాలయ సమితికి లేఖపూర్వకంగా తెలియజేస్తానని, విద్యార్థులకు అన్యాయం జరగకుండా చూస్తామని హామీ ఇచ్చారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో విద్యార్థుల తల్లిదండ్రులు కె. వెంకటేష్, జి. సాంబశివరావు, ఎం. దివ్య, పి. జయలక్ష్మి, ఎం. వీర్రాజు తదితరులు ఉన్నారు.

మళ్లీ మళ్లీ ఇది రానిరోజు

53 ఏళ్ల తర్వాత ఏడు పదుల వయసులో అ'పూర్వ' కలయిక



తమ గురువును ఆత్మీయంగా సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఒకప్పుడు కలసి చదువుకున్నారు.. ఆ తర్వాత ఎవరికి వారు తమ తమ ఉద్యోగాల్లో, వ్యాపారాల్లో బిజీ అయిపోయారు. దాదాపు 53 ఏళ్లు గడిచిపోయాయి. ఇప్పుడు వారంతా మళ్లీ ఒకసారి ఆత్మీయంగా కలుసుకున్నారు. ఏడు పదుల వయసులో తాము విద్యనభ్యసించిన కోవెలలో అంతా చేరి.. 20 ఏళ్ల వయసులో చేసిన పనులను, ఆనాటి చిలిపి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ అపురూప సమ్మేళనం విజయవాడ మహాత్మాగాంధీ రోడ్డులోని నోరి రామశాస్త్రి ప్రభుత్వం ఆయుర్వేద కళాశాలలో చోటుచేసుకుంది.

పూర్తి వివరాలు ఇవి..

1970లో నోరి రామశాస్త్రి ప్రభుత్వ ఆయుర్వేద కళాశాలలో డిగ్రీ ఆయుర్వేద వైద్యం కోర్సును ప్రారంభించారు. అప్పటి మొదటి బ్యాచ్‌కు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు సోమవారం సత్యనారాయణపురంలోని గాయత్రి ఫంక్షన్ హాలులో రీ యూనియన్ అయ్యారు. చదువు పూర్తిచేసుకొని నేటికి 53 ఏళ్లు పూర్తి కావటంతో ఒకరికి ఒకరు గుర్తుపట్టీ గుర్తుపట్టలేనట్లుగా దగ్గరగా వెళ్లి ఎంతో ఆప్యాయంగా పలకరించుకుంటూ యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కుశల ప్రశ్నలతో అలనాటి జ్ఞాపకాలతో పాటు ఇప్పటి వరకు జరిగిన విశేషాలు నెమరువేసుకున్నారు. దీంతో ఆ ప్రదేశంలో పండుగ వాతావరణం కనిపించింది. ఈ సందర్భంగా అలనాడు తరగతి గదిలో చక్కటి విద్యాబుద్ధులు నేర్పి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసిన అధ్యాపకుడు డాక్టర్ ఐ.రామకృష్ణకు పాదపూజ చేసి ఘనంగా సత్కరించుకున్నారు. చివరిగా అంతా గ్రూప్ ఫొటో దిగారు. ఈ కార్యక్రమాన్ని పూర్వ విద్యార్థులు డాక్టర్ చల్లా హరికుమార్, దినకరశర్మ, అమృత్ కుమార్, చాంద్ తదితరులు పర్యవేక్షించారు.

పారదర్శకంగా నియామకాలు

- అవకతవకలకు తావులేకుండా చర్యలు
- ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విఠల్‌రావు



డాక్టర్ ఎస్ఎస్ విఠల్‌రావు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాలలో నియామకాలన్నీ పారదర్శకంగా జరుగుతున్నాయని ప్రిన్సిపాల్ డాక్టర్ సత్తా శ్రీనివాస విఠల్‌రావు పేర్కొన్నారు. ఆయన సోమవారం 'సాక్షి'తో మాట్లాడుతూ ప్రభుత్వ నియమ నిబంధనలకు అనుగుణంగా మెరిట్ ఆధారంగానే నియామకాలు జరుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రపంచ విపత్తు కోవిడ్‌లో విధులు నిర్వహించిన వారికి వెయిటేజ్ మార్కులు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగానే ఇవ్వడం జరుగుతుందన్నారు. నియామకాల్లో ఎక్కడా ఎలాంటి అవకతవకలకు తావులేదని ఆయన తెలిపారు. ప్రతి రిక్రూట్‌మెంట్‌పై కిందిస్థాయి సిబ్బంది నుంచి పై స్థాయి వరకూ పరిశీలన ఉంటుందన్నారు. ఐసీఎంఆర్‌లో నియామకాల్లో ఎక్కడా ఎలాంటి అవినీతికి తావులేకుండా జరిపినట్లు ఆయన తెలిపారు. ఈ విషయంలో ఆరోపణలకు తావులేకుండా ఎంపికలు జరిపామన్నారు. మెరిట్ లిస్టును ఎవరైనా పరిశీలించవచ్చని, దానిలో అభ్యర్థులకు వచ్చిన మార్కులు, వెయిటేజీ మార్కులు స్పష్టంగా ఉంటుందన్నారు. మార్కులు లేకుండా పోస్టులు ఇవ్వడం కుదరదని, సిఫార్సులను కూడా పట్టించుకోమని, మెరిట్ ప్రాతిపదికంగానే ఉద్యోగ నియామకాలు చేపడతామని డాక్టర్ విఠల్‌రావు స్పష్టం చేశారు.

సర్పంచ్‌ల పోరాటానికి మద్దతు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు



సంఘీభావం తెలుపుతున్న వివిధ పార్టీలకు చెందిన నాయకులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాష్ట్రంలోని సర్పంచ్‌లు, గ్రామాల సమస్యలపై సర్పంచుల సంఘం చేపట్టే అన్ని ఉద్యమాలు, పోరాటాలకు బీజేపీ మద్దతు ఇస్తుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు అన్నారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ్ భవన్‌లో ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్, సర్పంచుల సంఘం అధ్యక్షురాలు వానపల్లి లక్ష్మీ ముత్యాలరావు ఆధ్వర్యంలో సర్పంచ్‌లు, గ్రామాల సమస్యలపై సోమవారం అఖిలపక్ష రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సోము వీర్రాజు కేంద్ర ప్రభుత్వం పంపిన నిధులను దారి మళ్లించడంపై సర్పంచుల సంఘం నాయకులు ఢిల్లీకి వస్తే కేంద్రానికి ఫిర్యాదు చేద్దామన్నారు. అనంతరం టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ప్రసంగించారు. జైభీమ్ పార్టీ నాయకుడు జడ శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హాకీ రాష్ట్ర సంఘం అవినీతిపై విచారణ చేయండి

- శాప్ ఎండీకి క్రీడాకారుల వినతి



శాప్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న హాకీ క్రీడాకారులు

విజయవాడ స్పోర్ట్స్: ఆంధ్రప్రదేశ్ హాకీ అసోసియేషన్‌లో జరుగుతున్న అవినీతి అక్రమాలపై విచారణ చేసి.. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సీనియర్ హాకీ క్రీడాకారులు కోరారు. విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) కార్యాలయం ఎదుట పలువురు హాకీ సీనియర్ క్రీడాకారులు 'సేవ్ హాకీ' నినాదాలతో సోమవారం ఆదోళన చేశారు. అనంతరం శాప్ వీసీ, ఎండీ డాక్టర్ ఎస్.ప్రభాకరరెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. హాకీ రాష్ట్ర అసోసియేషన్ ప్రతినిధులు ఎన్నో అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని వారు తెలిపారు. నైపుణ్యం ఉన్న క్రీడాకారులను పక్కకు నెట్టి అనర్హులకు సర్టిఫికెట్‌లు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. హాకీ సంఘానికి శాప్ గుర్తింపు లేదని తెలిపారు. క్రీడాకారుల నుంచి డబ్బులు వసూలు చేస్తూ పనికిరాని సర్టిఫికెట్‌లను ఇస్తున్నారన్నారు. నేషనల్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ కోడ్ (ఎస్ఎన్‌డీసీ)–2011 ప్రకారం హాకీ సంఘానికి ఎన్నికలు నిర్వహించి, హాకీ క్రీడకు పూర్వ వైభవం తీసుకురావాలని కోరారు. శాప్ ఎండీకి వినతిపత్రం ఇచ్చిన వారిలో హాకీ సీనియర్ క్రీడాకారులు గురుభాస్కరరావు, సాయికుమార్ ఉన్నారు.